# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 20-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ ఈరోజు విడుదల చేయనుంది.**
2. **తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు.**
3. **నేరస్తులను గుర్తించి చట్టప్రకారం శిక్షించేందుకు.. సాంకేతికత సాయం తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ బృందం ఈరోజు నుంచి రెండు రోజులపాటు గుజరాత్‌లో పర్యటించనుంది.**
5. **ఆసాములకు భద్రత, భరోసా కల్పించే ఉద్దేశంతో భూభారతి చట్టం తీసుకొచ్చామని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ ఈరోజు విడుదల చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయనుంది. మెగా డీఎస్సీకి సంబంధించిన పూర్తి సమాచారం, సంబంధిత జీవోలు, ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్షా షెడ్యూలు, సిలబస్, సహాయ కేంద్రాల వివరాలు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఈరోజు ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంచనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఒకప్రకటనలో తెలిపారు.

-------------------------------

తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలని, పరిశ్రమలు పెరగాలని అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి వివరిస్తూ....

...వాయిస్.. 38 సెకన్లు....

-------------------------------

ఆంధ్రప్రదేశ్ లో నేరస్తులను గుర్తించి చట్టప్రకారం శిక్షించేందుకు.. సాంకేతికత సాయం తీసుకుంటున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధిలో పోలీస్ ఉన్నతాధికారులతో నిన్న ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... సైబర్ నేరాల కట్టడి కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాల వల్లే 70 శాతం కేసులలో నిందితులను పట్టుకున్నామని మంత్రి వెల్లడిస్తూ....

..వాయిస్..37 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా గుజరాత్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించేందుకు పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ బృందం రెండు రోజులపాటు అక్కడ పర్యటించనుంది. రాజధానిలో నిర్మించనున్న భారీ విగ్రహాల కోసం ఈరోజు ఏక్తానగర్‌లో ఉన్న సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ విగ్రహాన్ని పరిశీలించనున్నారు. మధ్యాహ్నం అహ్మదాబాద్ శివారులోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీని, రాత్రికి స్పోర్ట్స్ సిటీని సందర్శించనున్నారు. రేపు ఉదయం సబర్మతి రివర్ ఫ్రంట్‌ను పరిశీలిస్తారు. ఈ పర్యటనలో మంత్రి వెంట సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ ఛైర్మన్ లక్ష్మీపార్థసారథి, ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు ఉన్నారు.

---------------------------

మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు పోలవరం ప్రాజెక్ట్, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిన్న సందర్శించారు. మహారాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి సంజయ్ బెల్సారే, గోదావరి నది నిర్వహణ ఔరంగాబాద్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ తీర్మన్వర్ తో సహా ఇతర అధికారులు పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమలను సందర్శించారు. పోలవరం ప్రాజెక్ట్‌లో స్పిల్ వే, స్పిల్ వే గేట్లు, ఫిష్ లేడర్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతం, పోలవరం జల విద్యుత్తు కేంద్రాన్ని పరిశీలించారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, మెటీరియల్ వివరాలను స్థానిక జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టిసీమ ప్రాజెక్టును సందర్శించారు. అక్కడి పంప్ హౌస్, ఫోర్ బేలను పరిశీలించారు.

---------------------------

రైతులు జొన్నల విక్రయాల్లో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ –సీతక్క పేర్కొన్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపి జి. నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఎకరాకు 14క్వింటాళ్ల కొనుగోలుకు త్వరలో ఉత్తర్వులు జారీచేస్తామని మంత్రి వెల్లడిస్తూ....

..వాయిస్..37 సెకన్లు

---------------------------

ఆసాములకు భద్రత, భరోసా కల్పించే ఉద్దేశంతో భూభారతి చట్టం తీసుకొచ్చామని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూభారతిపై కర్షకులకు అవగాహన కల్పించాలని మంత్రి

సూచించారు. నాగర్ కర్నూల్‌లో జరిగిన రెవెన్యూ సదస్సుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారందరికీ పైసా ఖర్చు లేకుండా పాసు పుస్తకాలు అందిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి భూసమస్యలను పరిష్కరిస్తారని తెలియజేస్తూ.....

..వాయిస్ .. 37 సెకన్లు....

----------------------------

వచ్చే రెండురోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. కోస్తాంధ్రలో గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరమధ్య మహారాష్ట్ర నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. తెలంగాణ, కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా ఇది కొనసాగుతోంది అని వెల్లడించింది.

కాగా తెలంగాణలో రాగల రెండురోజుల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ సమయంలో మోస్తారు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అలాగే రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

======================